

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

## ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా
# చర్యలు చేపట్టాలి

○ రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

ఆదిబట్ల, జూన్ 23 : జిల్లాలో రైతులకు ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉండేలా వెంటనే చర్యలు చేపట్టాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొని జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ.. ఇప్పటికే జిల్లాలో వర్షాలు కురవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఎలాంటి విత్తనాలు, ఎరువుల కొరత ఏర్పడకుండా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా జిల్లాలో నకిలీ విత్తనాలపై ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తూ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువుల కొరత సృష్టించే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన తెలిపారు.

వర్షాకాలం సమీపిస్తుండడంతో వైద్యాధికారులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు గ్రామాలు, తండాల్లో పర్యవేక్షిస్తూ చర్యలు చేపట్టాలని సూచించారు. మొక్కలు నాటడానికి అధికారులు సిద్ధం కావాలన్నారు. వన మహోత్సవంలో మొక్కలు నాటడానికి స్థలాలను గుర్తించి గుంతలు తీసి సిద్ధం చేయాలన్నారు. నాటిన మొక్కలను సంరక్షించేలా చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులకు సూచించారు.

### ప్రజావాణికి 76 ఫిర్యాదులు

ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను ఆయన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీతతో కలిసి స్వీకరించారు. ప్రజావాణిలో 76 ఫిర్యాదులు రాగా.. అందులో రెవెన్యూ శాఖ-31, ఇతర శాఖలకు సంబంధించి 45 ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్‌లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

◆ వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
◆ కలెక్టరేట్ ఆవరణలో 'వన్ మెడీ హబ్' ఆధ్వర్యంలో వైద్య శిబిరం

# ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, జూన్ 23 : ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో వన్ మెడీ హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో బీపీ, బిల్ రూబిన్ టెస్ట్ ద్వారా కొలెస్ట్రాల్, కిడ్నీ, లివర్, కాల్షియం, క్రియాటిన్ తదితర ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఉద్యోగులు, ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకొని పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జీవన శైలి, ఆహారపు అలవాట్లు, వాతావరణం మార్పుల వల్ల అనారోగ్యాలకు గురవుతున్నామన్నారు. కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు, ఉద్యోగులకు వన్ మెడి హబ్ ఆధ్వర్యంలో ఆరోగ్య వైద్య పరీక్షలు చేపట్టి రిపోర్టులకు అనుగుణంగా తగు సూచనలతోపాటు, వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఉచిత శిబిరాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో క్షయ వ్యాధిని నిర్మూలించే దిశగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా దీర్ఘకాలంగా దగ్గుతో బాధపడేవారు క్షయ వ్యాధి పరీక్షను తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులను ఇవ్వడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్‌చౌదరి, డీఎంహెచ్‌వో వెంకటరవణ, వన్ మెడీ హబ్ ఫౌండర్ సంతోష్, డాక్టర్ శ్రీకాంత్, ల్యాబ్ టెక్నీషియన్ రాహుల్, సిబ్బంది, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఈ నెల 26 వరకు 'నషా ముక్త్ భారత్ అభియాన్'

మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా జిల్లాలో ఈ నెల 26 వరకు నిర్వహించనున్న 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వారం రోజులపాటు చేపట్టే కార్యక్రమాల విజయవంతానికి చేపట్టాల్సిన చర్యల గురించి కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ నెల 25న మాదకద్రవ్యాల నియంత్రణ అంశంపై పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించాలన్నారు. మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే సంబంధిత శాఖల అధికారులకు సమాచారం అందించాలని, టోల్ ఫ్రీ నంబర్ 1908కి కూడా ఫోన్ చేసి సమాచారం తెలియజేయవచ్చని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం రూపొందించిన గోడ ప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఎస్పీ నారాయణరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి, డీఎస్పీ జానయ్య, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి వెంకటరమణ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సంబంధిత అధికారులున్నారు.

### నేడు రైతులతో సీఎం ముఖాముఖి

వానకాలం 2025కి సంబంధించి పంట సాగుకై పెట్టుబడి సాయాన్ని రైతు భరోసా పథకం ద్వారా నిధులను విజయవంతంగా రైతుల ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా.. మంగళవారం సాయంత్రం 6 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. నోడల్ అధికారులుగా మండల స్థాయి అధికారులను నియమించి రైతు వేదికల వద్దకు ప్రజాప్రతినిధులు, రైతులు చేరుకునేలా ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో సోమవారం వరకు 2,62,669 మంది రైతులకు 7 ఎకరాల వరకు రూ.318.45 కోట్ల రూపాయలు జమ చేయడం జరిగిందని చెప్పారు. కొడంగల్ నియోజక వర్గానికి సంబంధించి 7 ఎకరాలకు సంబంధించి 53,765 రైతులకు రూ.68.4 కోట్లు వారి ఖాతాల్లో జమ చేయడం జరిగిందని, మిగతా రైతులకు రెండు రోజుల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. ముఖాముఖి కార్యక్రమానికి వికారాబాద్ నుంచి 2, తాండూరు నుంచి 1, పరిగి నుంచి 1, కొడంగల్ నుంచి 1 చొప్పున 5 బస్సుల్లో 250 మంది రైతులను తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందని కలెక్టర్ వివరించారు.

### ఇందిరమ్మ ఇల్లు వచ్చినట్లా.. రానట్లా..



మా ఊరిని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం లబ్ధిదారుల జాబితాను తయారు చేశారు. అన్ని విధాల అర్హులమైన మాకు ఇందిరమ్మ ఇండ్లకు ఎంపిక చేశారు. నా భార్య పార్వతమ్మ పేరుపై లిస్టులో పేరు వచ్చింది. జనవరి 26 2025న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మంజూరు పత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేందుకు అన్ని విధాల అర్హులని చెప్పారు. కానీ లిస్టులో మా పేరు రాలేదు. ఈ విషయమై సంబంధిత అధికారులను అడగగా తర్వాత వస్తది అంటూ చెబుతూ కాలయాపన చేస్తున్నారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో స్పందించిన అధికారులు ఎంపీడీవో సర్‌ను కలవాలని చెప్పారు. అధికారులు స్పందించి తొందరగా ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా చూడాలని కోరుతున్నాం.

- చల్లా వెంకట్‌రాములు, అనంతసాగర్, కులకచర్ల మండలం

### దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాలకు చెందినవారి నుంచి 146 దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా అధికారులందరూ సమయపాలన పాటించాలని, జిల్లా కార్యాలయం, మండల కేంద్రాల్లో బయోమెట్రిక్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజావాణిలో 146 దరఖాస్తులు రాగా.. అందులో హౌసింగ్ శాఖ, ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు కలెక్టరేట్ సెక్షన్లు, రెవెన్యూ, ఇతర శాఖలకు సంబంధించి ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వసుచంద్ర పాల్గొన్నారు.



బైపాస్ నిర్మాణం కోసం తవ్విన గుంత ఇదే..

# నిర్లక్ష్యం ప్రాణం తీసింది

## మిషన్ భగీరథ పైపులైన్ ధ్వంసం.. గుంతలో నిలిచిన నీళ్లు
## నీటిలో పడి మహిళ మృతి

మొయినాబాద్, జూన్ 23 : హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి బైపాస్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మిషన్ భగీరథ పైప్ లైన్ పగిలి గుంతలో నిలిచిన నీటిలో బట్టలు ఉతకడానికి వెళ్లిన ఓ మహిళ నీటిలో మునిగి మృత్యువాత పడిన సంఘటన రెండు రోజుల క్రితం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అప్పా జంక్షన్ నుంచి వికారాబాద్ జిల్లాలోని మన్నెగూడ వరకు హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. అందులో భాగంగా మొయినాబాద్‌లో అమ్డాపూర్ చౌరస్తా నుంచి సురంగల్ రోడ్డును తాకుతూ తాజ్ హోటల్ వరకు బైపాస్ రోడ్డు పనులు చేపడుతున్నారు. సురంగల్ రోడ్డు వద్ద చేపడుతున్న బైపాస్ పనుల్లో భాగంగా పెద్ద గుంత తవ్వారు. రెండు రోజుల క్రితం రాత్రి సమయంలో ఇటాచీ పనులు చేపడుతుండగా.. సురంగల్ శ్రీరాంనగర్, ముర్తుజాగూడ గ్రామాలకు వెళ్లే మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయింది. దీంతో అక్కడ ఉన్న గుంతలు నీళ్లతో నిండాయి. రోడ్డు పక్కనే గుడిసె వేసుకుని ముగ్గురు పిల్లలతో జీవనం సాగిస్తున్న ఓ మహిళ బట్టలు ఉతకడానికి ఆదివారం నీటి గుంత వద్దకు వెళ్లింది. బట్టలుతుకుతుండగా ప్రమాదవశాత్తు నీటి గుంటలో జారిపడి బురదలో ఇరుక్కుపోయి మృత్యువాతపడింది. ఆలస్యంగా రోడ్డు పనులు జరుగుతుండటంతో మహిళ అసువులు బాసిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సురంగల్ గ్రామానికి వెళ్లే రోడ్డు వద్ద బైపాస్ పనులు జరుగుతుండటంతో అక్కడ బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఐదు రోజుల క్రితం శ్రీరాంనగర్ గ్రామానికి చెందిన వ్యక్తి బైక్‌పై మొయినాబాద్ నుంచి శ్రీరాంనగర్ వెళ్తుండగా బైపాస్ వద్ద ఉన్న బారికేడ్లను ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. మహిళ బైపాస్ రోడ్డు గుంతలో పడి మృతిచెందడంతో ఆ పసిపిల్లలు ఎవరూ లేని అనాథలయ్యారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని, మిషన్ భగీరథ పైపులైన్ పగులగొట్టిన వ్యక్తులపై, నేషనల్ హైవే అథారిటీ అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# మొహర్రం పండుగకు అన్ని ఏర్పాట్లు చేయాలి



సమీక్షా సమావేశంలో జిల్లా అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఆదిబట్ల, జూన్ 23 : ఈ నెల 27 నుంచి జరుగనున్న మొహర్రం ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మొహర్రం పండుగపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దర్గాల వద్ద నీటి వసతి, పారిశుధ్యం సమస్యలు తలెత్తకుండా ఆయా మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతోపాటు అవసరమైన చోట వీధి దీపాల ఏర్పాటు, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. దెబ్బతిన్న రహదారులను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించాలని పోలీస్ శాఖ వారికి తెలిపారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అగ్నిమాపక సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. వేడుకల సందర్భంగా ఏవైనా ఇబ్బందులుంటే స్థానికంగా ఉండే అధికారులను సంప్రదించాలని నిర్వాహకులకు సూచించారు. ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆమె కోరారు. సమావేశంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి నవీన్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

○ అధికారులకు కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాలు
○ ప్రజావాణిలో 224 అర్జీలు స్వీకరణ



అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ ఆర్వీ కర్ణన్, అధికారులు

సిటీబ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను బాధ్యతతో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ అధికారులకు సూచించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నగరం నలుమూలల నుంచి ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను కమిషనర్ స్వీకరించారు. ఫిర్యాదులను ఆయా విభాగాలకు పంపి తక్షణ చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలన చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. వివిధ శాఖల మధ్య సమన్వయం మెరుగుపరుచుకుని ఒకే ఫిర్యాదు రిపీట్ కాకుండా నివారించాలని సూచించారు. ప్రజావాణిలో 78 విన్నపాలు రాగా టౌన్‌ప్లానింగ్ విభాగానికి 45, ట్యాక్స్ సెక్షన్ 13, శానిటేషన్ నాలుగు, ఇంజినీరింగ్ విభాగం 3, జలమండలి 2, భూ సేకరణ, ఫైనాన్స్, ఏసీ లీగల్, విజిలెన్స్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా ఫోన్ ఇన్ ద్వారా ఏడు ఫిర్యాదులను స్వీకరించినట్లు పేర్కొన్నారు. ఆరు జోన్లలో 146 అర్జీలు స్వీకరించగా, కూకట్‌పల్లిలో 57, సికింద్రాబాద్‌లో 53, శేరిలింగంపల్లిలో 17, చార్మినార్‌లో 8, ఎల్బీనగర్ జోన్‌లో ఆరు, ఖైరతాబాద్‌లో ఐదు అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

## అమ్మకు వందనం కార్యక్రమంలో ఎంపీ డీకే అరుణ



కమ్మదనం గ్రామంలో మొక్కను నాటుతున్న ఎంపీ డికె అరుణ

షాద్‌నగర్‌రూరల్, జూన్ 23 : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని ఎంపీ డీకే అరుణ అన్నారు. డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఫరూఖ్‌నగర్ మండలంలోని కమ్మదనం గ్రామంలో సోమవారం నిర్వహించిన అమ్మకు వందనం కార్యక్రమంలో అమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం గ్రామాల్లో మొక్కలను నాటారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

కడ్తాల్, జూన్ 23 : ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ, పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు చారగొండ వెంకటేశ్ అన్నారు. సోమవారం తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించి పాఠశాలకు సమయానికి రాని ఉపాధ్యాయులకు సాధారణ సెలవు (క్యాజువల్ లీవ్) వేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశమై సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. అనంతరం వెల్జాల్ గ్రామంలోని వేదాద్రి లక్ష్మీనర్సింహ స్వామివారిని ఆయన దర్శించుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, పాఠశాలల హెచ్ఎంలు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ అంజయ్యగౌడ్, ఆలయ ధర్మకర్త శ్రీనివాసమూర్తి, మాజీ సర్పంచ్ రమేశ్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ అంబాజీ, మాజీ ఉప సర్పంచ్‌లు, నాయకులు, పీడీ పరమేశ్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో సమావేశమైన రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు చారగొండ వెంకటేశ్

# అవుట్ డోర్ మీడియాకు అన్యాయం

సిటీబ్యూరో, జూన్ 23(నమస్తే తెలంగాణ) : వేలాది మంది ఉపాధి పొందుతున్న అవుట్ డోర్ మీడియాకు స్వరాష్ట్రంలో తీరని అన్యాయం జరుగుతుందని తెలంగాణ అవుట్ డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్(టోమో) సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసి తమ గోడు విన్నవించుకున్నారు. రాష్ట్రంలోని అన్ని విభాగాల ప్రకటనలకు రుసుం వసూలు చేయాలని, కొత్త అనుమతులు జారీ చేయాలని, పెరిగిన హైదరాబాద్ పరిధికి అనుగుణంగా ఇతర మున్సిపాలటీల్లోనూ బహిరంగా హోర్డింగ్ నిర్వహణ సమస్యలపై ఎమ్మెల్సీతో చర్చించారు. అవుట్ డోర్ మీడియాను పరిరక్షించేలా ప్రభుత్వానికి విన్నవించాలని ఆయనకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త ప్రకటలన విధానం అమలు చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా అవుట్ రోడ్ మీడియా పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై టోమోకు మద్దతుగా పనిచేస్తామని ఎమ్మెల్సీ హామీ ఇచ్చినట్లుగా సభ్యులు పేర్కొన్నారు. జనరల్ సెక్రటరీ రమేశ్, జాయింట్ సెక్రటరీ మధు, ట్రెజరర్ విష్ణువర్ధన్, కార్యవర్గ సభ్యులు మహేశ్, రాజు, సనత్ తదితరులు ఉన్నారు.

# మెట్రో ప్రమాదాలకు పరిహారం

సిటీబ్యూరో, జూన్ 23(నమస్తే తెలంగాణ) : మెట్రో నిర్మాణం జరుగుతున్న, మెట్రో ప్రయాణంలో జరిగే ప్రమాదాలకు నష్టపరిహారాన్ని కేంద్ర ప్రభుత్వం సవరించింది. మెట్రో రైలు ద్వారా జరిగే ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతే లేదా తీవ్ర గాయాలతో, రెండు చేతులకు నష్టం జరిగినా లేదా కాలు, చేతులకు అయ్యే గాయాలకు, తొడ భాగం, కళ్లు, చెవుడు, ముఖంపై కలిగిన గాయాలకు రూ. 8లక్షలను పరిహారంగా ఇవ్వనున్నారు. అదేవిధంగా ఇతర గాయాలకు కూడా రూ. 65వేల నుంచి రూ. 7.2లక్షల వరకు ప్రమాద తీవ్రతను బట్టి ఈ పరిహారాన్ని బాధితులకు ఇవ్వనున్నట్లుగా కేంద్ర గృహ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ మేరకు జీఎస్ఆర్ 402(ఈ) పేరిట నోటిఫికేషన్ జారీ చేసింది.

# సివిల్ సర్వీసెస్ పరీక్షకు ఉచిత శిక్షణ

మేడ్చల్, జూన్ 23: సివిల్ సర్వీస్ పరీక్షకు (ప్రిలిమ్స్, మెయిన్స్)కు సిద్ధం అవుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్లో ఉచితంగా శిక్షణనివ్వనున్నట్టు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి వచ్చే ఏడాది మే వరకు 10 నెలల శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణతో పాటు వసతి సౌకర్యం కూడా పొందే అవకాశం ఉందన్నారు. 100 మంది అభ్యర్థుల శిక్షణకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులకు వచ్చే నెల 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో http :// tsstudycircle.co.in దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# విదేశీ విద్యకు మొండిచెయ్యి..!

❑ అంబేద్కర్ విదేశీ విద్యా పథకానికి మంజూరుకాని నిధులు
❑ 2వ సెమిస్టర్ ఫీజులను విద్యార్థుల ఖాతాల్లో జమచేయని సర్కార్

మేడ్చల్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : అంబేద్కర్ విదేశీ విద్యా పథకానికి నిధులు మంజూరు కాకపోవడంతో విదేశాల్లో చదువుకుంటున్న ఎస్సీ విద్యార్థులకు తిప్పలు తప్పడంలేదు. 2వ సెమిస్టర్ ఫీజుల చెల్లింపులకు సంబంధించి విద్యార్థుల ఖాతాల్లో నగదు ఇప్పటికీ జమ కాలేదు. 2వ సెమిస్టర్ ఫీజులకు సంబంధించి సంబంధిత షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ నుంచి వివరాలను పంపించినప్పటికీ ఆర్థికశాఖ నుంచి క్లియరెన్స్ ఇవ్వకపోవడంతో ఫీజుల చెల్లింపు జరగలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అంబేద్కర్ విదేశీ విద్యా పథకానికి ఎంపికైన విద్యార్థులు.. విద్యను అభ్యసించేందుకు విదేశాలకు వెళ్తారు. వారి చదువుకవసరమయ్యే రూ.20 లక్షలను ప్రభుత్వం అందిస్తుంది. సెమిస్టర్ల వారీగా నిధులను సమీకరించాల్సి ఉండగా గత ఏడాది మార్చి నెలలో నిధులు రాగా మొదటి సెమిస్టర్‌కు ఫీజులు చెల్లించారు. రెండో సెమిస్టర్‌కు ఇప్పటివరకు ఫీజలకు సంబంధించిన నిధులు మంజూరుకాలేదు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నుంచి 2024-25 విద్యా సంవత్సరానికిగాను 72 మంది ఎస్సీ విద్యార్థులు ఈ పథకం ద్వారా విదేశాల్లో విద్యను అభ్యసిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వందలాది సంఖ్యలో ఎస్సీ విద్యార్థులు వెళ్లినా ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విదేశీ విద్యార్థులను పట్టించుకోవడంలేదని వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

### నిద్రావస్థలో సెలక్షన్ కమిటీ..!

అంబేద్కర్ విదేశీ విద్యా పథకానికి ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు విదేశీ విద్యకు విద్యార్థులను సెలక్ట్ చేయలేదు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నుంచి అంబేద్కర్ విద్యా విదేశీ పథకానికి అర్హత ఉన్న 32 మంది విద్యార్థులు జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అభివృద్ధి శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుదారుల వివరాలను జిల్లా నుంచి ఎస్సీ కమిషనరేట్ కార్యాలయానికి సమర్పించినా ఇప్పటివరకు సెలక్షన్ చేయకపోవడంతో వివిధ దేశాల్లో విద్యా సంవత్సరం ఆగస్టు నెలలో ప్రారంభం కానున్న నేపథ్యంలో సమయం తక్కువగా ఉండటంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ సంవత్సరంలో అంబేద్కర్ విదేశీ విద్య అమలవుతుందా లేదా అన్న సందేహాలను ఎస్సీ విద్యార్థులు వ్యక్తం చేస్తున్నారు.

# జీపీఏ దస్త్రాలను సృష్టించి భూమి కాజేశారు

## చిల్కమర్రిలో వెలుగు చూసిన ఘటన.. కేసు నమోదు చేసిన పోలీసులు

షాద్‌నగర్, జూన్ 23 : వారసత్వంగా వచ్చిన భూమిని పట్టాదారుడికి తెలియకుండానే జీపీఏ దస్త్రాలను సృష్టించి 2 ఎకరాల 28 గుంటల భూమిని కాజేసిన ఘటన ఫరూఖ్‌నగర్ మండలం చిల్కమర్రి గ్రామంలో ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు, బాధితురాలి కథనం ప్రకారం.. చిల్కమర్రి గ్రామానికి చెందిన కొత్తపల్లి వినోద భర్త శ్రీనివాస్‌రెడ్డి మృతిచెందడంతో ఆమె భర్తకు సంబంధించిన భూమి సర్వే నం.74, 68, 59లలో 2 ఎకరాల 28 గుంటల భూమిని 2022లో విరాసత్ చేయించుకున్నారు. దీనికి సంబంధించిన భూమి విషయమై ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అధికారులను కలిశారు. అదే గ్రామానికి చెందిన కొత్తపల్లి సుభాన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నవనీతతో పాటు మీ సేవ నిర్వాహకుడు పథకం ప్రకారం భూమిని కాజేసేందుకు ధరణి ద్వారా వచ్చిన ఓటీపీని బాధితురాలు వినోద ద్వారా సేకరించి జీపీఏ దస్త్రాలను సృష్టించారు. ఈ విషయం బాధితురాలికి తెలువకపోవడంతో మరోమారు సోమవారం తహసీల్దార్ కార్యాలయం అధికారులను వివరణ కోరడంతో జీపీఏ దస్త్రాల ద్వారా భూమిని ఇతర వ్యక్తులు పొందారని చెప్పారు. దీంతో స్థానిక తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జరిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణలో పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు.

## దరఖాస్తుల ఆహ్వానం

తెలుగు యూనివర్సిటీ, జూన్ 23 : అబిడ్స్ బొగ్గులకుంటలో గల తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల(సాయంత్రం)లో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జే చెన్నయ్య సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. తెలుగు భాషా సాహిత్యాల్లో 1965 నుంచి విశేష కృషి చేస్తున్న పరిషత్ పీడీసీ(ప్రీ డిగ్రీ కోర్సు), బీఏ (లాంగ్వేజెస్) కోర్సులు కొనసాగుతున్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు రెండేళ్ల పీడీసీ కోర్సుకు అర్హులని వెల్లడించారు. ఇంటర్ పూర్తి చేసిన వారు బీఏలో డిగ్రీ ఆన్‌లైన్ పద్ధతి(దోస్త్) ద్వారా ప్రవేశం పొందాలన్నారు. తెలుగు ద్వితీయ భాషగా డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఎంఏ కోర్సుకు అర్హులని తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి 9వరకు తరగతులు జరుగుతాయన్నారు. వివరాలకు 9441085114, 9032812971లో సంప్రదించాలని చెన్నయ్య కోరారు.

## 30వ తేదీ నుంచి సెల్ట్ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్(సెల్ట్)లో ఈ నెల 30 నుంచి తరగతులను నిర్వహించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవిన్ సౌడ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్' పేరుతో నిర్వహించే రెండు నెలల కోర్సుకు ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటల నుంచి ఏడున్నర గంటల వరకు ప్రత్యేక బ్యాచ్‌ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఇతర వివరాలకు 79899 03001లో సంప్రదించాలని ఆయన సూచించారు.

## 28న జరిగే ఎంబీఏ పరీక్షల వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 28న నిర్వహించనున్న ఎంబీఏ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. యూజీసీ నెట్ పరీక్ష నేపథ్యంలో ఎంబీఏ (డే) నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, రెండు, నాలుగో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్, ఎంబీఏ (ఈవినింగ్) అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. ఈ పరీక్షను తిరిగి వచ్చే నెల 9న నిర్వహించనున్నామన్నారు. పరీక్షా కేంద్రం, సమయంలో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు www.osmania.ac.inలో చూసుకోవాలని ఆయన సూచించారు.